బీఆర్‌ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

కుత్బుల్లాపూర్ అభ్యర్థి కేపీ వివేకానంద్


మద్దతు ప్రకటిస్తున్న పట్టభద్రుల సంఘం సభ్యులు


వివేకానంద్‌ను సత్కరిస్తున్న సూపర్ మ్యాక్స్ ఉద్యోగులు


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌పై పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న ప్రజలు

దుండిగల్: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ కావడంతో ఆ పార్టీలో ఫుల్ జోష్ నెలకొంది. పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి.. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూనే భవిష్యత్‌లో మెట్రో రైలు విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపడతామని.. మరిన్ని కొత్త పథకాలను తీసుకొస్తామని మంత్రి కేటీఆర్ తెలపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తన సోదరులు లాంటి వారని, వారిద్దరు కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని మంత్రి కేటీఆర్ ప్రసంగించడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వివేకానంద్‌కు మద్దతు తెలిపిన సూపర్‌మ్యాక్స్ ఉద్యోగులు..

◆ ఇటీవల తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ల ఆధ్వర్యంలో సూపర్ మ్యాక్స్ కంపెనీ ఉద్యోగులు, కార్మికులు మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అయితే గురువారం జరిగిన రోడ్ షోలో వారికి న్యాయం చేయడంతో పాటు అన్ని విధాలుగా అండగా ఉంటామని కేటీఆర్ ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే వివేకానంద్‌కు వారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

పట్టభద్రుల మద్దతు..

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పట్టభద్రుల సంఘం నాయకులు బిపిన్ సక్సేనా ఆధ్వర్యంలో పలువురు యువకులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా బలపరుస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో జగదీష్, శ్రీనివాస్, శివ, బలరాం, రవి, శరత్, శ్రీకాంత్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బీఆర్‌ఎస్ యువజన అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తుల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం..

◆ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్ వెంకటేశ్వర గార్డెన్స్‌లో నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలోని వడ్డెర కులస్తుల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని గుర్తు చేశారు. బీసీ బంధు అర్హులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ సర్కార్ అన్నారు. మన సంక్షేమం కోసం పని చేసే సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, సంఘం సభ్యులు పిట్ల మల్లేష్, గండయ్య, ఎర్ర లక్ష్మయ్య, మంజునాథ్, గిరిబాబు, హనుమయ్య, దశరథ్, పూజారి, రాజు, రాములు, ఎస్.మల్లేష్, శ్రీను, ఎల్లమ్మ, సురేష్, మల్లేష్, శంభీపూర్ యాదగిరి, రాజు, వెంకటేష్, శ్రీను నవీన్, రాములు, పరమేష్, గంగాధర్, శివరాత్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్


వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్ల స్వాధీనం


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ ఆదేశాలను శుక్రవారం ఎక్సైజ్ స్పెషల్ టీమ్ బృందం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ పరిధిలోని ఫతేనగర్, పార్థివాడ, వడ్డెర బస్తీ, ఐడీపీఎల్ కాలనీ, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

◆ ఫతేనగర్‌కు చెందిన ముదావత్ ధర్మీ(46) నుంచి 26 ఆఫీసర్స్ చాయిస్ బాటిళ్లు, వడ్డెర బస్తీలో 24 బీరు బాటిళ్లు, 250 లీటర్ల కల్లును సీజ్ చేశారు. జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌కు చెందిన దుర్గం మురళీగౌడ్ ఇంటిపై దాడి చేసి 36 ఓసీ మద్యం బాటిళ్లు సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో 300 లీటర్ల కల్లును ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ మాధవయ్య, బాలానగర్ సీఐ వేణుగోపాల్, సనత్‌నగర్ సీఐ బాల్‌రాజ్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ యాదయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సారెడ్డి, ఎస్‌ఐలు షర్మిల, రఘు, శ్యామ్‌సుందర్, యూసుఫుద్దీన్, సలీం, ఆయా స్టేషన్లకు చెందిన 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్ కాల్ ఇండియా విజన్‌పై సదస్సు


మహేశ్ వై రెడ్డిని సత్కరిస్తున్న వివిధ విభాగాల హెచ్‌ఓడీలు

దుండిగల్: సమకాలికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తేనే దేశం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని లాజిస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ మహేశ్ వైరెడ్డి అన్నారు. దుండిగల్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అమృత్ కాల్ ఇండియా విజన్–2047పై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

◆ భారత దేశ అభివృద్ధి, దీర్ఘకాలిక లక్ష్యాలు, ఆర్థిక అభివృద్ధి, సామాజిక సంక్షేమం, మౌళిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, వివిధ రంగాల్లో జరిగే అభివృద్ధిపై వివరించారు. ముఖ్యంగా యువత వారి జీవితాశయాలను నెరవేర్చుకునే విధంగా ఎంచుకునే లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ప్రగతి సాధిస్తునే మరో నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'యాట్రిబ్యూట్స్ ఫర్ హై పర్‌ఫార్మెన్స్' వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, డీన్ వేణుగోపాల్

సుభాష్‌నగర్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో గురువారం ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'యాట్రిబ్యూట్స్ ఫర్ హై పర్‌ఫార్మెన్స్' అంశంపై రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌ను ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వర్క్‌షాప్‌ల నిర్వహణతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహద పడుతుందన్నారు.

◆ డీన్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ... విద్యార్థులు వర్క్‌షాప్‌ల ద్వారా కొత్త విషయాలను తెలుసుకుని వాటిని ఆచరణలో పెట్టాలన్నారు. మోటివేషన్ స్పీకర్ నాగప్రసాద్ మాట్లాడుతూ... విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎలా చేరుకోవాలో వివరించారు.


రేవంత్‌రెడ్డిని సత్కరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

కొలన్ హన్మంతరెడ్డిని గెలిపించాలని అభ్యర్థిస్తున్న కార్యకర్తలు


హన్మంతరెడ్డిని గెలిపించాలని కోరుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి


శ్రీనివాస్‌నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన కె.ఎం.ప్రతాప్, దీపా అనీల్

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి విజయానికి పార్టీ శ్రేణులు శుక్రవారం విస్తృతస్థాయి ప్రచారం నిర్వహించాయి. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, మల్కాజిగిరి పార్లమెంట్ మహిళా కాంగ్రెస్ అబ్జర్వర్ దీపా అనిల్, అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌లు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించి బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాచనోళ్ల లక్ష్మి, జంగయ్యగౌడ్ ప్రభాకరరెడ్డి, అప్పలనాయుడు, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కొలన్ హన్మంత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో పాదయాత్ర చేపట్టారు. నిజాంపేట్ 31, 32, 33, 10వ డివిజన్లు, రాజీవ్ గృహ కల్పలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా పలువురు పార్టీలో చేరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పేట్‌బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గణేశ్ తెలిపారు. బాలజీ ఆస్పత్రి, ఎస్‌సిఎల్ సౌత్, శ్రీసీ గేట్ నెంబరు 1, 2, 3, లయన్ పార్క్, అంగడిపేట్, ప్రధాన రహదారిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

◆ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్, డిమార్ట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

8వ బెటాలియన్‌లో 'మిత్ర షేర్ అండ్ షైన్'

గచ్చిబౌలి: ప్రణాళికతో ముందుకు సాగాలని టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ తెలిపారు. శుక్రవారం కొండాపూర్ 8వ బెటాలియన్‌లో మిత్ర షేర్ అండ్ షైన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఆర్థికంగా ఎదగడానికి ఎలాంటి ప్రణాళికలు అవసరం, ఆశావాదం, కృతజ్ఞతా భావం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు దేవిదాసు రాథోడ్, రెహమాన్,నర్సింహ్మస్వామి, సత్యనారాయణ, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో..



నాగుల చవితిని పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు సంప్రదాయ దుస్తులలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భారీ సంఖ్యలో వచ్చి పుట్టకు పాలు సమర్పించారు.

– సుభాష్‌నగర్

ఛట్ పూజకు ఏర్పాట్లు పూర్తి


రింగ్ బస్తీలో కొలన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: ఉత్తర భారతీయులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఛట్‌పూజకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని రింగ్ బస్తీ, మగ్దూమ్‌నగర్, సీసాల బస్తీల్లో ఉన్న ఛట్ పూజ కోసం ఏర్పాటు చేసిన కొలనులను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈనెల 19, 20వ తేదీల్లో ఛట్‌పూజ కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని జగన్ పేర్కొన్నారు.

నిజమైన బంగారు తెలంగాణను తీసుకొస్తాం

బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్
- భారీగా హాజరైన కార్యకర్తలు, స్థానికులు
- ఇక్కడ గెలవడానికి కేసీఆర్ రూ.100కోట్లైనా ఖర్చు పెడతారని వ్యాఖ్య
- కూన శ్రీశైలంగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థన


స్ట్రీట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్


ఈటల రాజేందర్, కూన శ్రీశైలంగౌడ్‌లను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇవ్వని కేసీఆర్ పేదోళ్ల గుడిసెలను లాక్కుని బడాబాబులకు కట్టబెడుతున్నారని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆరోపించారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి ఆయన స్ట్రీట్ మీటింగ్‌లు నిర్వహిచారు. గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లో జరిగిన మీటింగ్‌లో ఈటల రాజేందర్ కేసీఆర్, బీఆర్‌ఎస్ అభ్యర్థి వివేకానంద్‌లే లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాని పేదలు కోపంగా ఉన్నారన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గెలవడానికి కేసీఆర్ రూ.100 కోట్లు ఖర్చు పెట్టేందుకైనా వెనుకాడరని ఆరోపించారు. ఓటుకు రూ.10వేలు అయినా ఇస్తారని విమర్శించారు. బీఆర్‌ఎస్ డబ్బులు ఇస్తే తప్పకుండా తీసుకోండి.. కాని ఓటు మాత్రం కమలం గుర్తుకు వేసి కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించాలని కోరారు.

◆ ప్రతి పేదవాడికి 60గజాల స్థలం ఇస్తాం.. దేశ ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల్లో ఉచిత విద్య, వైద్యం, ఇళ్లపై హామీలు ఇచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హయాంలో ఇంటి పెద్ద చనిపోతే రూ.5 లక్షల ఇన్సురెన్స్ అందిస్తున్నారిని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పేదవాడికి 60 గజాల స్థలం లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఇస్తామని తెలిపారు.

బీజేపీ వస్తే తెల్లరేషన్ కార్డులు ఇస్తాం

◆ కేసీఆర్ ప్రభుత్వం పథకాలు, పింఛన్లకు రూ.13,500 కోట్లు ఇస్తూ మరో వైపు మద్యం అమ్మకాలతో రూ.45వేల కోట్లు గుంజుకుంటున్నారని విమర్శించారు. ఎవరి డబ్బులు ఎవరికి ఇస్తున్నారో ప్రజలు బాగా ఆలోచించాలని ఈటల కోరారు. ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ మనకు బంగారు తెలంగాణ కాదు బాధల, కన్నీళ్ల తెలంగాణ ఇచ్చారని దుయ్యబట్టారు. బీజేపీ వస్తే తెల్లరేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. నిజమైన బంగారు తెలంగాణను తీసుకొస్తామన్నారు.

శిలాఫలకాలు వేసి వదిలేశారు...


◆ కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... చంద్రగిరి నగర్‌లో తాగునీటిలో డ్రైనేజీ నీళ్లు కలిసి అనేకమంది రోగాల బారిన పడ్డారన్నారు. తొమ్మిదేళ్లగా ఏనాడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే స్థానికుల బాధలను పట్టించుకోలేదని విమర్శించారు. తాను ఓడినా, గెలిచినా ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉన్నానని అందరికీ తెలుసన్నారు. ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలకు శిలాఫలకాలు వేసి వదిలేశారని విమర్శించారు. నిధులు విడుదల కానిదే పనులు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు.


◆ కుత్బుల్లాపూర్ కురుమ సంఘం నాయకులు బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతు తెలుపుతూ వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుంటామని తీర్మానం పత్రాన్ని అందజేశారు.


◆ జగద్గిరిగుట్ట కూన మహాలక్ష్మి నగర్ నుంచి పలువురు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ చేరారు. కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.


◆ దూలపల్లి ఎన్టీఆర్ చౌరస్తా వద్ద బీజేపీ ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో పెద్ద ఎత్తున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దూలపల్లిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చానని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శలు గుప్పించారు. తాను గెలిచిన వెంటనే పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్ మల్లారెడ్డి, కొంపల్లి, దూలపల్లి నేతలు పాల్గొన్నారు.

◆ కుత్బుల్లాపూర్ టీజేఎస్ యూత్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరగా కూన శ్రీశైలంగౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పారు.


బీజేపీలో చేరిన టీజేఎస్ యూత్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌కు కండువా కప్పుతున్న శ్రీశైలంగౌడ్


సూరారంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్


దూలపల్లిలో శ్రీశైలంగౌడ్‌కు హారతులు పడుతున్న మహిళలు


దూలపల్లిలో స్ట్రీట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహ్మద్ పాషా


మహ్మద్‌పాషా (ఫైల్)

నిజాంపేట్: వేగంగా వచ్చిన స్కూల్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ బైకిస్ట్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్లింకెట్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న మహ్మద్‌పాషా(20) గురువారం ఉదయం 9.20 గంటల ప్రాంతంలో బాచుపల్లి చౌరస్తా నుంచి మియాపూర్ వైపు బైక్(టీఎస్30 ఏ4682)పై వెళ్తుండగా బొల్లారం చౌరస్తాలోని హైబిస్కస్‌ట్రీ హోటల్ సమీపంలో వేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు (ఏపీ 29 వీ 6131) ఢీకొట్టింది. ఈ ఘటనలో పాషా తలకు బలమైన గాయం కావడంతో స్పాట్‌లోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు డ్రైవర్ బాలాస్వామిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపి మృతికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌సీయూ–ధర్మవన నేచర్ ఆర్క్ ఫౌండేషన్ ఒప్పందం

రాయదుర్గం: ధర్మవన నేచర్ ఆర్క్ ఫౌండేషన్‌తో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. భారతదేశంలో అరుదైన, అంతరించిపోతున్న మొక్కలు, జంతువుల సంరక్షణకు అంకితం చేయబడిన ఒక ఎన్‌జీఓ ప్రత్యేకించి హైదరాబాద్‌లో భాగమైన తూర్పు కనుమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. జీవావరణశాస్త్రం, జీవవైవిధ్య పరిరక్షణపై పరిశోధన సహకారం కోసం ఒప్పందం జరిగింది. ధర్మవన నేచర్ ఆర్క్ తెలంగాణలోని యాదాద్రి–భువనగిరి జిల్లాలో 400 ఎకరాల విస్తీర్ణంలో నెలకొంది. కార్యక్రమంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎన్ శివకుమార్, ప్లాంట్ సైన్సెస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్, ప్రొఫెసర్ డాక్టర్ సిద్దార్థన్, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.